క్లుప్తంగా

నేడు కంటి వైద్య శిబిరం

వేముల : మండల పరిధిలోని గొందిపల్లె గ్రామంలో మంగళవారం పులివెందులకు చెందిన సురక్ష ఐకేర్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైద్యులు బాలాంజనేయులు తెలిపారు. మందులను పంపిణీ చేస్తామన్నారు. ఆపరేషన్లు అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేస్తామన్నారు.

మద్యం షాపు తొలగించాలని ఆందోళన

పులివెందుల రూరల్ : పట్టణంలోని ముద్దనూరు రోడ్డు సమీపంలోని ఆర్అండ్బీ వెనుకవైపున ఇళ్ల మధ్యలో ఉన్న మద్యం షాపును అక్కడ నుంచి తొలగించి వేరే ప్రాంతంలో ఏర్పాటు చేసుకోవాలని ఆ ప్రాంత మహిళలు ఆందోళన చేపట్టారు. సోమవారం ఉదయం స్థానిక చెన్నారెడ్డి కాలనీ మహిళలు మద్యం షాపు వద్దకు వెళ్లి ఆందోళన చేపట్టారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డికి వారు వినతి పత్రం అందజేశారు. దీనికి మున్సిపల్ ఇన్చార్జి వైఎస్ మనోహర్రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్లు స్పందిస్తూ గతంలోనే ముద్దనూరు రోడ్డులోని మద్యం షాపు, కదిరి రోడ్డులోని మద్యం షాపులవల్ల ఇబ్బందులు పడుతున్న విషయం మా దృష్టికి వచ్చిందని.. మద్యం షాపుల మార్పుకు అధికారులకు నివేదించడం జరిగిందని.. త్వరలో మద్యం షాపులను మార్చడం జరుగుతుందని వారు తెలిపారు.

3న వాహనాల వేలం

జమ్మలమడుగు: వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఈనెల 3వ తేదీన వేలం పాట నిర్వహిస్తున్నట్లు ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి లత పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. వేలం పాటలో పాల్గొనే వారు ఆధార్ కార్డు, లేదా ఇతర గుర్తింపు కార్డులు తీసుకుని పాల్గొనవచ్చునని సూచించారు.

తెగుళ్లను నివారించాలి

ముద్దనూరు: వేసవిలో చీనీ పంటను ఆశించే వేరుకుళ్లు, బంక తెగుళ్ల నివారణపై రైతులు జాగ్రత్త వహించాలని ముద్దనూరు డివిజనల్ ఉద్యానశాఖ అధికారి మల్లేశ్వరరెడ్డి సూచించారు. సోమవారం మండలంలోని మంగపట్నం, శెట్టివారిపల్లె గ్రామాల్లో చీనీ తోటలను ఆయన పరిశీలించి తెగుళ్ల నివారణకు వాడాల్సిన మందులను వివరించారు.

అందరి సహకారంతో అభివృద్ధి

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : అందరి సహకారంతో మండలాన్ని అభివృద్ధి చేస్తామని ఎంపీపీ చేరెడ్డి సావిత్రి తెలిపారు. సోమవారం మైలవరం మండల సాధారణ సమావేశాన్ని నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ వేసవిలో గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీటీసీలు, సర్పంచ్లు మండలంలో ఉన్న సమస్యలను సమావేశం దృష్టికి తెచ్చారు. మార్కెట్ యార్డు చైర్మన్ రమణారెడ్డి మాట్లాడుతూ సమగ్ర రక్షిత మంచినీటి పథకం ద్వారా మైలవరం, పెద్దముడియం మండలాల్లోని కొన్ని గ్రామాల్లో నీరు అందించడం లేదని తెలిపారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ మహాలక్ష్మి, ఎంపీడీఓ రామచంద్రారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

అధికారులు అందుబాటులో ఉండాలి

ఎర్రగుంట్ల: స్పందనలో అర్జీలు ఇవ్వడానికి వస్తున్న ప్రజలకు వార్డు, గ్రామ సచివాలయాలలో సిబ్బంది అందరూ అందుబాటులో ఉండి అర్జీలను స్వీకరించాలని మండల ప్రత్యేకాధికారి వీరబ్రహ్మయ్య అన్నారు. సోమవారం ఎర్రగుంట్ల తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన స్పందనలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతు సచివాలయాలలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి బయోమెట్రిక్ వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగేశ్వరరావు, ఎంపీడీఓ సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్నే మా భవిష్యత్కు స్పందన

పులివెందుల రూరల్ : పులివెందుల మండలం నల్లపురెడ్డిపల్లె గ్రామంలో సోమవారం సాయంత్రం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జేసీఎస్ కన్వీనర్ భాస్కర్రెడ్డి సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో కలిసి ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరిస్తూనే.. గత చంద్రబాబు పాలనలో ప్రజలకు జరిగిన మోసాన్ని వివరించారు. కార్యక్రమంలో విద్యా శాఖ చైర్మన్ అరుణ కుమారి, డైరెక్టర్ రామమల్లేశ్వరరెడ్డి, వైఎస్సార్సీపీ నాయకులు డిష్ వెంకటరెడ్డి, శ్రీనివాసులు యాదవ్ పాల్గొన్నారు.

వర్షాన్ని సైతం లెక్క చేయకుండా..



ఎర్రగుంట్ల : ఒక పక్క జోరున వర్షం పడుతున్నా లెక్క చేయకుండా వాలంటీర్లు వారికి కేటాయించిన కుటుంబాల పరిధిలోని పింఛన్దారులకు పింఛన్ డబ్బులను ఇంటి వద్దకు వెళ్లి అందించారు. ఎర్రగుంట్ల మున్సిపల్, మండల పరిధిలో సోమవారం తెల్లవారుజాము నుంచి వాలంటీర్లు పింఛన్ డబ్బులను పంపిణీ చేపట్టారు.

ఘనంగా కార్మికుల దినోత్సవం



పులివెందుల టౌన్: భవన నిర్మాణ సంఘ కార్మికులతో వైఎస్ మధురెడ్డి



జమ్మలమడుగు: మే డే కార్యక్రమాలలో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్రెడ్డి



ఎర్రగుంట్ల : జెండాను ఎగుర వేస్తున్న వివిధ సంఘాల నాయకులు



కమలాపురం : ఏఐటీయూసి జెండా ఎగుర వేస్తున్న నాగేశ్వరరావు

పులివెందుల టౌన్ : మే డే సందర్భంగా పులివెందులలో సోమవారం కార్మికుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పార్నపల్లె రోడ్డులోని కూరగాయల మార్కెట్ సమీపంలో ఉన్న కార్మికుల సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్మికుల దినోత్సవ వేడుకలకు వైఎస్సార్సీపీ నేత వైఎస్ మధురెడ్డి మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్తో కలిసి హాజరై కార్మికుల జెండాను ఎగురవేశారు. అలాగే వైఎస్సార్సీపీ వాణిజ్య విభాగపు రాష్ట్ర కార్యదర్శి సోపాల వీరాను భవన నిర్మాణ కార్మికులు ఘనంగా సత్కరించారు. అలాగే పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో కార్మికుల దినోత్సవాన్ని పురస్కరించుకుని పుచ్చలపల్లి సుందరయ్య చిత్ర పటానికి సీఐటీయూ ఏరియా కార్యదర్శి గఫూర్ అంగన్వాడీ కార్యకర్తలతో కలిసి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ అంబకపల్లె నారాయణస్వామి, భవన నిర్మాణ కార్మిక సంఘ అధ్యక్షుడు చలపతి, ఉపాధ్యక్షుడు టైటస్, కోశాధికారి రవి, డైరెక్టర్ భాస్కర్, సెక్రటరీ సన్న, సభ్యులు నారాయణ, చంద్ర, బాషా, ప్రసాద్, రామాంజనేయులు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల కోసం నిరంతర పోరాటం

జమ్మలమడుగు: కార్మికుల సమస్యల పరిష్కారం కోసం వారి హక్కుల సాధన కోసం రాజీలేని పోరాటం చేస్తున్నామని సీఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ పేర్కొన్నారు. సోమవారం మే డే సందర్భంగా కార్మిక దినోత్సవాన్ని నిర్వహించి పాత బస్టాండ్లో మే డే జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో విజయ్కుమార్, సీపీఎం నాయకుడు శివనారాయణ, సీఐటీయు నాయకుడు లక్ష్మీ నారాయణ, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

– మేడే సందర్భంగా పాతబస్టాండ్లోని ఆటో స్టాండ్లో కార్మిక దినోత్సవాన్ని నిర్వహించారు. సోమవారం ఆటోయూనియన్ నాయకుల ఆధ్వర్యంలో జరిగిన మేడే కార్యక్రమానికి ఎమ్మెల్యే సుధీర్రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎద్దుల ఈశ్వరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి కార్మికులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ పట్టణ అధ్యక్షుడు పోరెడ్డి మహేశ్వరరెడ్డి, వైస్ చైర్మన్ సింగరయ్య, ఇండస్ట్రీయల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ మార్బల్ శ్రీను, ముల్లాజానీ, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల : మే డే కార్యక్రమాన్ని ఎర్రగుంట్ల, ఆర్టీపీపీలలోని పలు కార్మిక సంఘాలు సోమవారం ఘనంగా జరుపుకున్నాయి. ఎర్రగుంట్లలోని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మే డే సందర్భంగా కడప రోడ్డులోని మార్కెట్ యార్డు నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. తర్వాత ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా మే డే ఎర్ర జెండాను ఎగుర వేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు సుబ్బారెడ్డి, పొన్నశివయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే సీఐటీయూ ఆధ్వర్యంలో ఎర్రగుంట్లలోని కడప రోడ్డులో మేడే సందర్భంగా ఎర్రజెండాను ఎగుర వేశారు. ఈ కార్యక్రమంలో ఆశా జిల్లా కార్యదర్శి జి రాజామణి, అంగన్వాడీ జిల్లా అధ్యక్షురాలు ఆర్ లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

కార్మిక హక్కులు కాలరాస్తే తిరగబడతాం

కమలాపురం: కార్మిక హక్కులు కాలరాస్తే తిరగబడతామని సీపీఐ మండల కార్యదర్శి నాగేశ్వరరావు స్పష్టం చేశారు. సోమవారం మే డే ను పురస్కరించుకుని స్థానిక క్రాస్ రోడ్డు వద్ద ఏఐటీయూసీ పతాకాన్ని ఆయన ఎగుర వేశారు.

– స్థానిక క్రాస్ రోడ్డు వద్ద సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కామనూరు శ్రీనివాసుల రెడ్డి సీఐటీయూ పతాకాన్ని ఆవిష్కరించారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి సమిష్టిగా పోరాడాలి

వేంపల్లె : భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికి అందరూ సమిష్టిగా పోరాడాలని ఆ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు బి.ఆంజనేయులు పేర్కొన్నారు. సోమవారం ప్రపంచ కార్మికుల దినోత్సవం సందర్భంగా స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో కార్మికులందరూ పెద్ద ఎత్తున పాల్గొని జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో భవన నిర్మాణ సంఘ ప్రధాన కార్యదర్శి బాలాజి, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఓబులేసు, గౌరవాధ్యక్షులు రమణయ్య, సభ్యులు పాల్గొన్నారు.

చింతకొమ్మదిన్నె : బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు కొమ్ముకాస్తున్నదని సీపీఎం నాయకులు దస్తగిరి రెడ్డి, ఆర్సీపీ మండల కార్యదర్శి ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం కార్మిక దినోత్సవం సందర్భంగా మండలంలోని ఇందిరా నగర్, సికెదిన్నె గ్రామాల్లో జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి ప్రసాద్, రమేష్, షద్రక్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ట వేడుకలు

లింగాల : మండల కేంద్రమైన దిగువ లింగాలలో పునఃనిర్మితమైన శ్రీకోదండరామాలయంలో శ్రీసీతారామ,లక్ష్మణ సమేత ఆంజనే యస్వామి విగ్రహ ప్రతిష్ట వేడుకలు సోమ వారం ఘనంగా ప్రారంభించారు. ఉదయం 6గంటల నుంచి వేద పండితులు సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో పంచాంగం రామ్కుమార్శర్మ బృందంచే విశేష పూజలు చేపట్టారు.

నేడు ఎంపీ లింగాలకు రాక..

కడప ఎంపీ వైఎస్ అవినాష్రెడ్డి మంగళవారం లింగాలకు రానున్నారు. కోదండ రామాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలలో ఆయన పాల్గొంటారని ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు తెలిపారు.

పుష్పాచలేశ్వరుడికి పూజలు



పూజలు చేస్తున్న దృశ్యం

వల్లూరు: పవిత్ర పుణ్య క్షేత్రమైన పుష్పగిరిలో కొండపైన శిఖరాగ్రంలో వున్న శ్రీ పుష్పాచలేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఘనంగా పూజలను నిర్వహించారు. శిథిలావస్థలో వున్న ఈ ఆలయాన్ని శ్రీ రామ రాజ్యం సంస్థ ఆధ్వర్యంలో శుభ్రపరిచారు. అనంతరం ఆలయంలో అర్చకుల ఆధ్వర్యంలో పూజలను నిర్వహించారు. టీటీడీ మెంబర్ టంగుటూరు మారుతీ ప్రసాద్ దంపతులు పూజలు నిర్వహించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

వేంపల్లె : స్థానిక పులివెందుల రోడ్డులో గంటన్న ఇటుకుల బట్టీ ఎదురుగా గుర్తు తెలియని వ్యక్తి శవం లభ్యమైనట్లు వేంపల్లె ఎస్ఐ తిరుపాల్ నాయక్ తెలిపారు. సుమారు 35ఏళ్ల నుండి 45ఏళ్ల వయస్సు గల మగ వ్యక్తి శవం కుళ్లిపోయి దుర్వాసన వస్తుండగా స్థానికులు గమనించి పోలీసులకు సోమవారం సమాచారం ఇచ్చారు. ఎవరైనా ఆచూకీ తెలిస్తే వేంపల్లె పోలీసులను 9121100550 సంప్రదించాలన్నారు.

చర్చి ప్రారంభం



బిషప్ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే సుధీర్రెడ్డి

జమ్మలమడుగు రూరల్: జమ్మలమడుగు మండల పరిధిలోని ఎస్. ఉప్పలపాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన చర్చిని మత పెద్దలు వైభవంగా ప్రారంభించారు. సోమవారం స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మూలే సుధీర్రెడ్డితో కలసి రాయలసీమ బిషప్ రెవరెండ్ డాక్టర్ ఐజాక్ వరప్రసాద్, సి.డి. భారతి, టీబిహెచ్ఎల్సి చైర్మన్ ఉప్పలపాడు శ్రీనివాసులురెడ్డి, మనోహర్రెడ్డిలతో కలసి ప్రారంభించారు. కార్యక్రమం అనంతరం ఎమ్మెల్సీ పి. రామసుబ్బారెడ్డి, టీడీపీ ఇన్చార్జి భూపేష్రెడ్డి, తదితరులు హాజరయ్యారు.

పిల్లల ఆరోగ్య స్థితి కోసం స్కానింగ్

జమ్మలమడుగు: గర్భవతిగా ఉన్న మహిళల కడుపులో ఉన్న పిల్లల పరిస్థితిని అంచనా వేయడం కోసం మాత్రమే స్కానింగ్ చేసుకోవాలని కాని ఆడ, మగ అని లింగనిర్ధారణ కోసం కాదని ఆర్డీఓ జి.శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయ ఛాంబర్లో స్త్రీ శిశు సంక్షేమ, వైద్యారోగ్యశాఖల అధికారులతో బేటీ బచావో..బేటీ పడావో, లింగ నిర్ధారణ నిషేధంపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ శాంతికళ మాట్లాడుతూ చట్టాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ నాగరాజు, రాజేశ్వరి, శ్రీనివాసులు, ఎస్ఎస్ఎంలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



వేంపల్లె: ఎంపీ వైఎస్ అవినాష్రెడ్డికి సమస్యను విన్నవిస్తున్న ప్రజలు



వేముల: నూతన సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్రెడ్డి

– కడప ఎంపీ వైఎస్ అవినాష్రెడ్డి

వేంపల్లె : పేదల జీవితాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాలు వెలుగులు నింపాయని కడప ఎంపీ వైఎస్ అవినాష్రెడ్డి పేర్కొన్నారు. సోమవారం వేంపల్లె మండలంలోని అమ్మగారిపల్లె గ్రామంలో ఎంపీ వైఎస్ అవినాష్రెడ్డి పాడా ఓఎస్డీ అనిల్కుమార్రెడ్డితో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి ప్రజలకు ప్రభుత్వం నుంచి చేకూరిన లబ్ధిని వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి పారదర్శక పాలన అందించడంతో పేదలకు సంక్షేమ లబ్ధి చేకూరుతోందన్నారు. ప్రతి కుటుంబానికి మంచి చేస్తున్న సీఎంకు అండగా నిలవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. అలాగే ఆ గ్రామ ప్రజలు విన్నవించిన వివిధ సమస్యలను ఓపికగా వింటూ వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేశారు. సంబంధిత అధికారులతో ఫోన్లలో మాట్లాడి సమస్యలను పరిష్కరించారు. ముఖ్యంగా గ్రామ పొలాలకు రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్, రేషన్ కార్డులు, పింఛన్లు, ఇళ్లు తదితర సమస్యలను ఆయన దృష్టికి తీసుకరాగా.. త్వరలోనే మీ సమస్యలను పరిష్కరిస్తామని వారికి భరోసా కల్పించారు. అనంతరం మే డే సందర్భంగా కార్మికులందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

– కార్యక్రమంలో జెడ్పీటీసీ రవికుమార్రెడ్డి, మండల కన్వీనర్ చంద్ర ఓబుళరెడ్డి, ఎంపీపీ లక్ష్మీగాయత్రి, రాష్ట్ర డైరెక్టర్ మునీర్ బాష, ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు ఆంజనేయులు, వైఎస్సార్సీపీ నాయకులు రాజగోపాల్రెడ్డి, శ్రీరామిరెడ్డి, వెంకటశేఖరరెడ్డి, గురివిరెడ్డి, లక్ష్మినారాయణరెడ్డి, తిరుమలరెడ్డి, ఈశ్వరరెడ్డి, రామాంజనేయరెడ్డి, రామగంగిరెడ్డి, సీఐ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

వేముల : మండల పరిధిలోని భూమయ్యగారిపల్లెలో సోమవారం కడప ఎంపీ వైఎస్ అవినాష్రెడ్డి పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ముందుగా ఆయన గ్రామానికి చేరిన వెంటనే ఓఎస్డీ అనిల్కుమార్రెడ్డి, మండల ఇన్చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి, జెడ్పీటీసీ కె.వెంకటబయపురెడ్డి, ఎంపీపీ చల్లా గంగాదేవి, మండల పరిశీలకుడు లింగాల రామలింగారెడ్డి, పీసీబీ డైరెక్టర్ మరకా శివకృష్ణారెడ్డిలతో కలిసి షిర్డిసాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రూ.1.04కోట్లతో నిర్మించిన నూతన సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ క్లినిక్లను ఆయన ప్రారంభించారు. అక్కడ నుంచి కళ్యాణ మండపానికి చేరుకుని కళ్యాణ మండపంతోపాటు భోజనశాలలను ప్రారంభించారు. అంతకమునుపు కళ్యాణ మండపం వద్ద నూతనంగా ప్రతిష్ఠించిన వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయనకు ప్రజలు వినతులు అందజేయడంతో అధికారులకు ఫోన్లు చేసి పరిష్కరించాలని వారికి సూచించారు. విలేజ్ క్లినిక్లో వైద్య సేవలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రాజారెడ్డి, సర్పంచ్ వేమయ్య, ఎంపీటీసీ మల్రెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీరామిరెడ్డి, వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఎంపీకి సన్మానం

వేముల : భూమయ్యగారిపల్లెలో ప్రారంభోత్సవాలు ముగించుకుని పులివెందులకు వెళుతున్న ఎంపీ వైఎస్ అవినాష్రెడ్డి వేల్పులకు చెందిన వైఎస్సార్సీపీ మండల పరిశీలకుడు లింగాల రామలింగారెడ్డి ఇంటికి చేరుకున్నారు.

ఈ సందర్భంగా వేల్పుల చెరువుకు నీటిని విడుదల చేసి రైతులను ఆదుకున్నందుకు రైతులతో కలిసి ఆయన ఎంపీ వైఎస్ అవినాష్రెడ్డిని సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ నిర్మల, ఎంపీటీసీ బాబ్జాన్, సొసైటీ అధ్యక్షుడు మాధవరెడ్డి, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన వెన్నపూస రవీంద్రారెడ్డి

పులివెందుల : పులివెందుల నియోజకవర్గం వేంపల్లె మండలం అమ్మగారిపల్లె గ్రామంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఉన్న ఎంపీ వైఎస్ అవినాష్రెడ్డిని వెన్నపూస రవీంద్రారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.

ఎర్రబల్లె చెరువుకు వరద నీరు



ఎర్రబల్లె చెరువుకు చేరుతున్న వరద నీరు

పులివెందుల రూరల్ : పులివెందుల మండలం నల్లపురెడ్డిపల్లె గ్రామ సమీపంలో ఉన్న ఎర్రబల్లె చెరువుకు ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీరు చేరుతోంది. ఆదివారం రాత్రి ఎగువ ప్రాంతాలైన అనంతపురం జిల్లా ముదిగుబ్బ, తలుపుల, కదిరి, బత్రేపల్లె ప్రాంతాల నుంచి నీరు ఎర్రబల్లె చెరువుకు చేరుతుండటంతో ఈ ప్రాంత ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వాగుల్లో జలప్రవాహం



చాగలేరు వద్ద పొంగి ప్రవహిస్తున్న వాగు

వేముల : మండల వ్యాప్తంగా ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. వేముల మండలంలో 2.6సెం.మీ వర్షపాతం నమోదైంది. వేసవి పంటగా పత్తి, మిరప పంటలను రైతులు సాగు చేసుకున్నారు. ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండటంతో పంట ఎదుగుదలలేక మొద్దుబారిపోయింది. భారీ వర్షానికి పదున్లు కావడంతో పంటలకు ఊరట కలుగుతోందని రైతులు అంటున్నారు.

ప్రజా సమస్యలన్నీ పరిష్కరిస్తాం

వీరపునాయునిపల్లె: ప్రజా సమస్యలను గుర్తించడమే గడప గడపకు మన ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే రవీంద్రనాథ్రెడ్డి అన్నారు. సోమవారం వీరపునాయునిపల్లెలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటి వద్దకు ఎమ్మెల్యే వెళ్లి ప్రభుత్వ పథకాలు, అమలు తీరుపై అడిగి తెలుసుకోవడంతో పాటు వారి సమస్యలను తెలుసుకొన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి సీఎం వైఎస్ జగన్మోహన్రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. రేషన్ కార్డులు, పింఛన్లు అందలేదని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల నుంచి అందిన వినతులు పరిశీలించి సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆయన ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో సీకే దిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజుల్రెడ్డి, రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్రెడ్డి, పౌరసరఫరాల డైరెక్టర్ గోపాల్రెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, స్థానిక ఎంపీటీసీ రాఘవ యాదవ్, సర్పంచ్ మణికంఠ, మాజీ సర్పంచు రవీంద్రారెడ్డి, సర్పంచ్లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



ప్రజల సమస్యలను తెలుసుకొంటున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్రెడ్డి

చేతికొచ్చిన పంట నీటిపాలు

చెన్నూరు : మండలంలో ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు భారీ వర్షం కురిసింది. చెన్నూరు మండల వ్యాప్తంగా 87.2. మిల్లీ మీటర్లు అత్యధిక వర్షపాతం నమోదయింది. కడప ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి సోమవారం చెన్నూరు శివాలపల్లె గ్రామాల్లో దెబ్బతిన్న వరి పంటను పరిశీలించారు. మండల తహసీల్దార్ మహమ్మద్ అలీ ఖాన్, మండల వ్యవసాయ అధికారి శ్రీదేవి, వ్యవసాయ సిబ్బంది సుజన, వీఆర్వోలు రసూల్, శ్రీకాంత్, రెవిన్యూ , వ్యవసాయ సిబ్బంది ఉన్నారు. 25 ఎకరాల్లో పంట దెబ్బతిన్నట్లు వ్యవసాయ అధికారులు అంచనా తయారు చేశారు.

కమలాపురం: కమలాపురం మండలంలో ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు భారీ వర్షం కురిసింది. 56.4 మి.మీ. వర్షపాతం నమోదు అయినట్లు తహసీల్దార్ నారాయణ రెడ్డి తెలిపారు. పి.వెంకటాపురం గ్రామంలో గాలి వానకు ట్రాన్స్ఫార్మర్ దెబ్బతిన్నదని రూ.50వేలు నష్టం వాటిల్లిందని ఏఈ చాంద్ బాషా తెలిపారు.

దెబ్బతిన్న పంట పరిశీలన

జమ్మలమడుగు: ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి మండల పరిధిలో 140 హెక్టార్ల వరి పంట నేలకు ఒరిగిందని వ్యవసాయాధికారి చంద్రశేఖర్రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన పంట దెబ్బతిన్న పంటల వివరాలను వెల్లడించారు. పెద్దదండ్లూరు, సిరిగేపల్లి, ధర్మాపురం, దానవులపాడు, గొరిగేనూరు, దేవగుడి గ్రామాలలో ఆదివారం రాత్రికురిసిన వర్షానికి పంట దెబ్బతిందని ఆయన తెలిపారు. అదేవిధంగా మండల పరిధిలోని ఎస్.ఉప్పలపాడు గ్రామంలో నీటిలో మునిగిపోయిన మిర్చి పంటను ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన నీటిలో పూర్తిగా మునిగిపోయిన మిర్చి పంటను పొక్లెయిన్ల సహకారంలో నీటిని మళ్లించి పంట పూర్తిగా నీటిలో నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టారు.



చెన్నూరు: పంట నష్టంపై ఆరా తీస్తున్న ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి

పేదల పక్షపాతి ముఖ్యమంత్రి వైఎస్ జగన్

జమ్మలమడుగు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి పేదల పక్షపాతి కావడంతోనే ప్రతి నిరుపేదకు నవరత్నాల పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్రెడ్డి పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం పట్టణ పరిధిలోని కన్నెలూరులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటి వద్దకు వెళ్లి సంక్షేమపథకాలు అందుతున్నాయా లేదా, అందకుంటే ఎందుకు అందడంలేదంటూ ఆరాతీశారు. వెంటనే మున్సిపాలిటి , సచివాలయ స్థాయి అధికారులను పిలిచి వారి సమస్యలను పరిష్కరిస్తూ వచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి నిరుపేదలకు సంక్షేమ పథకాలతో పాటు వారి పిల్లలకు కార్పొరేట్ వైద్యం , విద్యను అందించే విధంగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు ప్రజలలో మంచి గుర్తింపు తీసుకుని రావడంతో టీడీపీ నాయకులకు నిద్ర పట్టడం లేదన్నారు.

సమాజం బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందన్న సిద్ధాంతంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి పనిచేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ సింగరయ్య, కోఆప్షన్ సభ్యుడు లక్షుమయ్య, వేణుగోపాల్ యాదవ్, కిరణ్, రామకృష్ణ , రఘురామయ్య తదితరులు పాల్గొన్నారు.



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే సుధీర్రెడ్డి